కథ

# అమ్మా నన్ను క్షమించు

చెన్నూరి రాంబాబు

**వెంకట్రామయ్య ఈ కాలానికి చెందినవాడు కాదు. కొంచెం అహంకారం, మరికొంచెం క్రమశిక్షణ, ఇంకొంచెం చాదస్తం ఇవన్నీ కలిపి రంగరించితే వెంకట్రామయ్య అవుతాడని ఆయనంటే ఇష్టమున్నవాళ్ళు, ఇష్టంలేని వాళ్లు కూడా చెప్పే మాట. అయినా కూడా వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధత, శ్రద్ధ ఆయనను ఎవరూ వేలెత్తనివ్వకుండా చేశాయి.**

ఇంతకీ వెంకట్రామయ్య ఆ మండల కేంద్రంలో వున్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు. పిల్లలకు చదువు బాగా రావాలంటే క్రమశిక్షణ తప్పనిసరని నమ్ముతాడాయన. అలాగే గురువుని వేలెత్తి చూపడాన్ని ఎంతమాత్రం సహించడు.

ఆ రోజు వెంకట్రామయ్య స్కూలుకు చేరుకునేసరికే మిగిలిన టీచర్లు ఆయనకు అభినందనలు చెప్పటానికి సిద్ధంగా ఉన్నారు. వెంకట్రామయ్యకు సన్నిహితంగా ఉండే లెక్కల మాస్టారు అయిన రాజేశ్వర రావు అందరి తరపున పూలదండ మెళ్లోవేసి విషయాన్ని బయటపెట్టాడు.

''ఈ సారి రాష్ట్రం తరపున ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి మీరు ఎంపికయినట్లు మెసేజ్ వచ్చింది. దాంతోబాటు అన్ని ఛానెళ్లు స్క్రోలింగ్ ఇస్తున్నాయి. గత సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో జిల్లాలో మన స్కూల్‌కు మొదటి స్థానం వచ్చేలా చేశారు. ఇప్పుడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయుల్లో మీరొకరు. మీ సహచర ఉపాధ్యాయులుగా ఇది మాకెంతో గర్వకారణం'' అందరూ చప్పట్లు కొడుతుంటే. వెంకట్రామయ్య ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. గొంతు మూగపోగా కృతజతతో అందరికీ చేతులెత్తి నమస్కరించాడు.

***

''వెంకట్రామయ్య గారికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు వస్తే వచ్చివుండొచ్చుగాక, ఆయన పిల్లలకు క్రమశిక్షణ పేరిట పెద్ద పెద్ద పనిష్మెంట్‌లు ఇవ్వటం, అలాగే పిల్లలకు చెప్పుకునే ఆవకాశం ఇవ్వకపోవడం మాత్రం సరికాదు''. స్టాఫ్ రూంలో చర్చకు శ్రీకారం చుడుతూ అన్నాడు ఇంగ్లీష్ టీచర్ రాజేష్.

''ఆయన చదువుకున్నప్పుడు ఉన్న బోధనా పద్ధతుల్నే ఇప్పటికీ ఆయన కొనసాగిస్తున్నారు. అలా వద్దు మాస్టారు అంటే ఆయనకు కోపం వస్తుంది. నా ఉద్దేశంలో ఆయనలో కొంత ఆధునికత జోడయితే అది అందరికీ మంచిదని నా అభిప్రాయం'' సైన్స్ టీచర్ పద్మ సాలోచనగా అంది.

''ఏదయితేనేం.. ఆయన ఎలాంటి పైరవీలు లేకుండా, ఎవరి సిఫారసులు లేకుండా కేవలం తన స్వశక్తితో ఈ అవార్డుకు ఎంపికయ్యాడన్నది మనం మర్చిపోకూడదు''. తెలుగు మాస్టారు రాఘవయ్యగారు గుర్తుచేశారు.

''కానీ ఒక్కొక్కసారి ఆయన మొండివైఖరివల్ల మనం నష్టపోయామన్న సంగతి కూడా మనం మర్చిపోకూడదు''. అక్కసంగా అన్నాడు సోషల్ టీచర్ రాజారావు.

''బావుందండి.. మనం స్కూల్ వున్నచోట నివాసం ఉండం, క్లాసులు సరిగ్గా తీసుకోం, వీలయతే పిల్లలకే పనులు అప్పచెప్పుతాం, క్లాసు అవ్వగానే స్కూల్లోంచి మాయమైపోతాం. వెంకట్రామయ్య మాస్టారు వీటిని ఒప్పుకోరు. అవసరమైతే మన మెడలు వంచుతారు, ట్యూషన్లు చెప్పనివ్వరు. అందుకేగా మనకు కోపం ఆయనంటే...'' ఉండబట్టలేక అన్నాడు లెక్కల మాస్టారు రాజేశ్వరరావు.

చర్చని ఇంకా పొడిగిస్తే అనవసర ఇబ్బందులు తలెత్తుతాయని గ్రహించిన కొంతమంది ''మాస్టారుకి మంచి సన్మానం చేయడం మనందరి బాధ్యత. దీనికి ప్రయత్నాలు చేద్దాం'' అని ప్రకటించారు.

***

అభినందనల వెల్లువలో తడిసి ముద్దవుతున్న వెంకట్రామయ్య పనికి మాత్రం విశ్రాంతి ఇవ్వలేదు.

''మా అమ్మ వుంటే ఎంతో సంతోషించేదో, ఆవిడ కలలు నిజమైన ఈ సమయంలో ఆవిడ లేకపోవడం కొంచెం వెలితే''. తన గదిలోకి వచ్చిన రాజేశ్వరరావుతో ఈ మాట అన్నాడు వెంకట్రామయ్య.

''మీ అమ్మలేరు సరే... మీ అబ్బాయికి, శాంతకి ఈ విషయం చెప్పావా? లేదా?'' ఎదురు ప్రశ్నించాడు రాజేశ్వరరావు.

''సరే వెళ్దాం పద'' అన మిత్రుడితో కలిసి బయల్దేరాడు వెంకట్రామయ్య.

***

''మీరు అలా స్కూలుకు వెళ్లారో లేదో... ఒకటే ఫోన్లు. పొద్దెండి మీ కష్టాన్ని ఇన్నాళ్లు ఎవరూ గుర్తించలేదని బాధపడుతూ ఉండేదాన్ని. ఇన్నాళ్లకి ఆ కోరిక తీరింది'' విప్పారిన మొహంతో అంది శాంత, వెంకట్రామయ్యకు కాళ్ళు కడుక్కోవటానికి నీళ్లిస్తూ.

భార్య మాటలతో వెంకట్రామయ్య మనసు గతంలోకి వెళ్లింది. ఈ స్కూలుకొచ్చి ఐదేళ్ళయింది. వచ్చిన కొత్తలో అన్నీ సమస్యలే. మాస్టార్లు స్థానికంగా ఉండరు. ఉన్న వాళ్లు పాఠాలు సరిగ్గా చెప్పరు. ట్యూషన్లు చెబుతారు. వీటినన్నింటిని ఆపటానికి తను చాలా కష్టపడాల్సి వచ్చింది. నెమ్మదిగా అన్నీ కుదురుకోవటం ప్రారంభమయింది. అయినప్పటికి తనని పంపించాలని చాలామంది చాలా ప్రయత్నాలు చేశారు. కేవలం పిల్లల తల్లిదండ్రులు పట్టుదలే తనకు శ్రీరామ రక్షగా నిలిచింది. గత సంవత్సరంలో ఈ స్కూలుకి జిల్లాలోనే ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చింది.

''వడ్డించాను రండి... ఆలోచనల్లో ఎక్కడికో వెళ్లిపోయారు'' భార్య శాంత మాటలతో వర్తమానంలోకి వచ్చాడు వెంకట్రామయ్య.

''సరేగాని పావనికి చెప్పావా లేదా''.?

''మీరు రాకముందే మాట్లాడింది. అది ఎంత సంబరపడిందో.. అయితే అదికూడా మీకు ఓ ముఖ్యమైన విషయం చెప్పాలంది.''

భార్య మాటలకు చివాలున తలెత్తి చూశాడు. తన గారాల పట్టి పావని, తన మాటకెదురు చెప్పలేక ఇష్టం లేకపోయినా ఎమ్మెస్ చేయడం కోసం యుఎస్ వెళ్లింది. ఇక్కడే చదివి, ఇక్కడే సెటిల్ అవుతానని పావని పంతం. అక్కడి చదువులు చదివి ఇక్కడ స్థిరపడాలన్న పట్టుదల తనది. తనని నొప్పించడం ఇష్టం లేక తన పంతాన్ని సడలించుకొంది. ఇంకెంత ఇంకొక మూడు నెలలు ఆలోచనల్లోంచి బయటకు వచ్చి ఫోన్ వైపు నడిచాడు. ఫోన్ మొదటి రింగ్‌లోనే ''నాన్నా, కంగ్రాట్స్.. నాకెంత సంతోషంగా ఉందో తెలుసా...'' రిసీవర్‌లో పావని గొంతు ఉద్వేగంగా వినిపించింది వెంకట్రామయ్యకు.

''ఈ క్షణంలో నువ్వు ఇక్కడుంటే ఎంత బావుండేదోరా కన్నా...''

''నాన్నా... నువ్వేమనుకోనంటే నేను కూడా ఒక విషయం చెప్పాలి నాన్నా...

కూతురు గొంతులోని తత్తరపాటుకు ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాడు వెంకట్రామయ్య...

''ఏం చెప్పబోతోంది పావని.. కొంపతీసి అక్కడే ఉండిపోతాను నాన్నా అనదు కదా'' ఆ ఊహకే భయమేసింది వెంకట్రామయ్యకు...

''చెప్పరా కన్నా.. ఇంకొన్నాళ్ళు వుండి వస్తావా...'' లాలనగా అడిగాడు కూతుర్ని.

''అబ్బే అలాంటిదేం లేదు నాన్నా... నిన్నడగకుండా, నీకు చెప్పకుండా నేనో వ్యక్తికి మాటిచ్చేశాను నాన్నా, తనతో ఏడడుగులు నడుస్తానని...''

తన పావనా ఇలాంటి నిర్ణయం తీసుకుంది. వెంకట్రామయ్య గుండె జారిపోయింది. అయినా చిక్కబట్టుకుంటూ అడిగాడు ''ఎవరు తల్లీ అతను...''

''అతని పేరు రమేష్ నాన్నా.. నా క్లాస్‌మేటే.. చాలా మంచివాడు నాన్నా.. వాళ్ల నాన్నా నీకు తెలుసు నాన్నా... శ్రీశైలమని మీరు ఇంతకు ముందు పనిచేసిన స్కూల్లో ప్యూన్...''

అప్పటిదాకా అణిచిపెట్టుకున్న దుఃఖం పెల్లుబికింది వెంకట్రామయ్యలో.. రిసీవర్ జారిపోయింది.

''నాన్నా..నాన్నా...'' కూతురి మాటలు వినబడ్డం మానేశాయి.

ఏం విన్నాడు తను. తన పావనా ఈ మాట అన్నది. ఉదయం ఆనందం ఆవిరైపోయింది వెంకట్రామయ్యలో.

తనకు చెప్పకుండా తను. తన పావనా ఈ మాట అన్నది. ఉదయం ఆనందం ఆవిరైపోయింది వెంకట్రామయ్యలో.

తనకు చెప్పకుండా పావని పెళ్లి నిర్ణయాన్ని చెప్పడం వెంకట్రామయ్య అహాన్ని దెబ్బతీస్తే, తన స్కూలు అటెండర్ కొడుకుని చేసుకుంటా నాన్నా అని చెప్పటంతో అతను మొదలు నరికేసిన చెట్టులా అయిపోయాడు.

''ఇదంతా నీకు ముందే తెలుసా?'' బలహీనంగా అడిగాడు భార్యని. ''తెలుసు.. కానీ దానికి నేను చెప్పటం ఇష్టం లేదు. తనే చెప్పాలని దాని కోరిక..'' మొదటిసారి జీవితంలో కలత చెందాడు వెంకట్రామయ్య. తెలియని శూన్యం ఆవరిస్తుండగా


***

''ఏవిటి ఒక్కరోజులో అంత మార్పు వచ్చింది.. నిన్నటి హుషారు ఇవ్వాళ లేదు''. ఉదయాన్నే వాకింగ్‌లో అడిగాడు రాజేశ్వరరావు.

''నేనూహించని ఎదురు దెబ్బ తగిలింది''. విషయాన్ని వివరంగా చెప్పాడు మిత్రుడికి.

''దానికెందుకు ఇంత బాధపడి కృశించిపోవటం.. పావని ఇష్ట ప్రకారం కానివ్వు... నీక్కష్టమయినా అదే కరెక్టు..''

రాజేశ్వరరావు మాటలు పుండుకు రాసిన కారంలా అనిపించాయి. వెంకట్రామయ్యకు.




''నువ్వేదో నా దెబ్బకు మందు పూస్తావనుకున్నా గానీ.. గాయాన్ని పెద్దది చేస్తావనుకోలేదు..'' విలవిల్లాడుతు అన్నాడు వెంకట్రామయ్య.

''అయినా నీకు తెలుసు.. నాకు క్రమశిక్షణ ఇష్టం.. పెద్దవాళ్లను గౌరవించటం ఇష్టం.. నేనేదయినా భరిస్తానుగానీ, నా ఆత్మగౌరవానికి భంగం కలిగితే మాత్రం తట్టుకోలేను. తన నిర్ణయం తాను తీసుకుని ఇప్పుడు చెప్పడం ఇంకా కష్టంగా వుంది నాకు. ఏరోజూ ఎవరి ముందు దోషిగా నిలబడని నాకు అలాంటి పరిస్థితి కల్పించింది నా కూతురు. నా కూతురు పెళ్లి ఘనంగా చేయాలని, జిల్లా కలెక్టర్ లాంటి పెద్దవాళ్లను పిలవాలని ఎన్నో కలలు కన్నాను. అవన్నీ ఇప్పుడు కల్లలే కదా. వెంకట్రామయ్య తిక్క కుదిరింది. కూతురే తండ్రి పొగరుకు అడ్డుకట్ట వేసిందని అందరూ అనుకోరా.. నీ అంత సంస్కరణ వాదిని కాను నేను. ఒక మామూలు తండ్రిని. గౌరవంగా బతికే బడిపంతులుని''. గొంతు పూడుకుపోయింది వెంకట్రామయ్యకు తను ఇప్పుడేం చెప్పినా వెంకట్రామయ్యకు అర్థంకాదని అర్థం అయ్యింది రాజేశ్వరరావుకు.

***

''చిన్న పిల్లమీద ఎందుకంత కోపం... దాని మీద కోపంతో మూడు రోజుల్నుంచి స్కూల్‌కు వెళ్లటం మానేసారు. దానితో మాట్లాడ్డం మానేశారు. పసిది అన్న జాలి కూడా లేదు మీకు. అది మీకో మెయిల్ ఇచ్చింది. కొంచెం ఆ మెయిల్ అన్నా చూసారా లేదా'' శాంతమ్మ అన్న మాటలకు ఆలోచనల్లోంచి బయటకు వచ్చాడు వెంకట్రామయ్య.



యాంత్రికంగా కంప్యూటర్ ముందు కూర్చున్నాడు.

''నాన్నా...

నా మీద ఎందుకంత కోపం. మీకిష్టం లేని పనిచేశాననేగా.. నువ్వే కదు నాన్నా.. నీకెప్పుడూ నీ స్వంత వ్యక్తిత్వం ఉండాలి అంటూ వుండేవాడివి. మనం తప్పు చేయనప్పుడు ఎవరికి భయపడాల్సిన పని లేదు అనేవాడివి. గుర్తుందా నాన్నా... ఇది కేవలం కాలేజి చదువులప్పుడు ప్రేమ పేరుతో ఆవేశంలో తీసుకున్న నిర్ణయం కాదు నాన్నా... నీకు కోపం రాదంటే ఒక మాట నాన్నా.. ఇంత దూరం ఎగరలేనన్నా రెక్కలు కట్టి మరీ పంపించావు కదు నాన్నా.. మా మాస్టర్ గారి అమ్మాయి అని రమేష్ నాకు అన్నీ సమకూర్చబట్టి సరిపోయింది కానీ, లేకపోతే నా పరిస్థితి ఏమయ్యేది నాన్నా... కేవలం ఆ కృతజ్ఞతతో ఈ నిర్ణయం తీసుకున్నాననుకోకు నాన్నా.. ఒక మనిషిని నా లైఫ్ పార్టనర్ అని అనుకోవాలంటే ఆ మనిషి గురించి తెలియకపోతే ఎలా నాన్నా.. ఇన్ని రోజుల తర్వాత ఒకర్నొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చాను నాన్నా... మా మాస్టార్ గారి అమ్మాయని రమేష్ నాకన్నా మిమ్మల్ని ఎక్కువ తల్చుకుంటాడు. ప్లీజ్ నాన్నా.. నీకు కోపం వుంటే తిట్టు కాని మెయిల్‌కు సమాధానం ఇవ్వకపోవటం, ఫోన్ ఎత్తకపోవటం వంటివి చేయకు.

చివరిగా ఒక్క సంగతి నాన్నా... నువ్వు రమేష్‌ని మనస్ఫూర్తిగా అంగీకరిస్తేనే నా పెళ్లి. ఈ విషయం రమేష్‌కు నేను స్పష్టంగా చెప్పాను. ఈ విషయంలో తనది కూడా అదే ఆలోచన. నేను నిన్ను సాధిస్తున్నానని మాత్రం అనుకోకు నీ మెయిల్ కోసం చూస్తూ

నీ కన్నా...''

కూతురుకి తన పట్టుదలే వచ్చిందని అర్థమయింది వెంకట్రామయ్యకి.

***

''నువ్వు కాస్తా సెలవు పెట్టావు.. అవార్డు ఫంక్షన్ ఎప్పుడు, ఎలా జరుగుతుందో ఆ వివరాలన్నీ డి.ఇఒ ఆఫీస్ వాళ్లు పంపించారు. ఇప్పటికైనా శాంతించి నీ ప్రపంచంలోంచి మన ప్రపంచంలోకి రావయ్యా వెంకట్రామయ్యా..'' వాకింగ్‌లో తిరిగివస్తూ నవ్వించే ప్రయత్నం చేశాడు రాజేశ్వరరావు.

''ఆ అవార్డుకోసం నాకు వెళ్ళాలని కూడా అనిపించటం లేదు'' వెంకట్రామయ్య మాటలు కట్ చేస్తూ ''వెంటనే వెళ్దాం పద.. నేనే మీ ఇంటికి వస్తాను రడీగావుండు.... స్కూల్‌కు నువ్వు ఇవ్వాళ ఎలాగయినా రావాలి'' మరో మాటకు తావులేకుండా అక్కడ్నించి కదిలి వెళ్లిపోయాడు రాజేశ్వరరావు.

ఇంటికి చేరిన వెంకట్రామయ్యకు ఇంటి వద్ద స్కూల్లో పనిచేసే ఆయా లక్ష్మమ్మ అక్కడ వుండటం ఆశ్చర్యం కలిగించింది. ''స్కూల్లో అంతా బానే వుంది కదా.. భగవంతుడా ఇప్పుడింకో సమస్య నాకు అక్కడ సృష్టించకు తండ్రీ..'' అందరి దేవుళ్ళకి మొక్కు కుంటూ లోపలికి అడుగుపెట్టాడు.

''ఏమండీ మీ లక్ష్మమ్మది ఎంత మంచి మనసండీ.. అది నేను చెబితే కాదు లక్ష్మమ్మే చెప్పాలి..'' భార్య మాటలు వెంకట్రామయ్యలో అసహనాన్ని పెంచాయి.


''నమస్తే సార్'' ఇలా అంటూనే లక్ష్మమ్మ ''పాపా ఇటు రామ్మా'' అంటూ కేకేసింది. వెంకట్రామయ్యలో అసహనానికి అలజడి తోడయింది. అయినా కాస్త ప్రశాంతంగానే అడిగాడు.

''ఏమిటమ్మా విషయం.. ఏం జరిగింది.. నాకు ఏమీ అర్థం కావట్లేదు.''

''చెప్పు లక్ష్మమ్మా.. మాస్టారు ఏమీ అనుకోరులే చెప్పు..'' భరోసా ఇచ్చింది శాంతమ్మ.

భార్యకు విషయం మొత్తం తెలుసని అర్థమయింది వెంకట్రామయ్యకు. ''చెప్పమ్మా.. నీ సమస్య ఏమిటో చెప్పు''.. ఈ సారి కాస్త అనునయంగా అడిగాడు.

''బాబూ ఈ పిల్లది రోడ్డమీద చెత్త ఏరుకునే బతుకు. అమ్మా, బాబు దీని సదువు సట్టుబండలు చేసి రోడ్డుమీదకు తోలారు బాబూ. మూడు రోజులు బట్టి సూత్తన్నా



బాబూ. పిల్లది మూల కూర్చుని రోజు ఏడుత్తాంది. ఏందే ఇసయం అంటే ఇన్ని రోజులూ సెప్పలే బాబూ. ఇదిగో ఇయ్యాల సెప్పింది. దాని అమ్మా, అయ్యా సదువుకోనీకుండా ఇట్టా రోజూ పైసలు సంపాయించుకురా అని తోలతున్నారని. ఈ సెత్తంతా అమ్మి ఆ పైసలు ఆళ్లకిస్తుంది బాబూ.. అయితే ఈ పిల్లకు సదువుకోవాలని శానా కోరిక బాబూ.. తవరు తలుసుకుంటే ఆ పిల్లదానికి మన బళ్లో సీటి ప్పిత్తారేమోనని తీసుకొచ్చా బాబూ.. పిల్లది నాలుగు దాకా సదూకుంది బాబూ..''

''నువ్వేం కంగారు పడకు లక్ష్మమ్మా.. సార్ ఆ అమ్మాయికేదో చూస్తారులే'' అభయం యిచ్చేసింది శాంతమ్మ...

''ఏమండీ పాపం ఆ లక్ష్మమ్మ అంత ఇదిగా వస్తే మీరేం మాట్లాడరే'' భర్తని నిలదీసింది కూడా.

''నేను స్కూలు కొస్తున్నాను లక్ష్మమ్మా... ఈ పిల్లని అక్కడికి తీసుకురా..''

''అట్లాగే బాబూ..''

''పాపా నీ పేరేమిటి''

''రాజీ సార్...''

''నీకు చదువుకోవాలనుందా''

''వుంది సార్''

అప్పటి వరకు వెంకట్రామయ్యను పహారా కాస్తున్న డాంబికపు నీలి నీడలు ఒక్కొక్కటి విడి పోసాగాయి. వృత్తిపరంగా తన అంకిత భావం గొప్పదే కావచ్చు. కాని ఆ అంకిత భావంలో, మిడిసిపాటు ఎక్కువయిందని అర్థమయింది వెంకట్రామయ్యకు.

లక్ష్మమ్మకు ఏం అవసరం వుందని ఆ పిల్లను స్కూళ్లో చేర్పించటానికి అంత తాపత్రయపడుతోంది. ఒక్కసారి లక్ష్మమ్మ ముందు తాను చాలా అల్పుడన్న భావం కలిగింది వెంకట్రామయ్యకు తన విధులను సక్రమంగానూ, నిజాయితీతోనూ నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వం తనని ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తిస్తోంది. మరి ఏ మాత్రం అక్షర జ్ఞానం లేని లక్ష్మమ్మ ఆ పిల్ల ఆరాటాన్ని గుర్తించి దాన్ని తీర్చే ప్రయత్నం చేస్తోంది.

ఇక తన భార్య నిశ్శబ్దంగా తన సుఖం కన్నా, కష్టంలోనే ఎక్కువ పాలుపంచుకుంది. ఎందుకంటే సుఖాలను తాను మాత్రమే ఆస్వాదిస్తున్నాడు కాబట్టి. అయినా భర్త కొచ్చిన పేరులో తనను తాను చూసుకునే ప్రయత్నం చేస్తోంది.

అలాగే పావని, కులరహిత, మతరహిత సమాజ స్థాపనకు మనం పాటు పడాలి అన్నట్టుగా తనవంతు కృషిగా తనకు నచ్చిన వాడ్ని ఎన్నుకుంది. ఎక్కడా ఆదర్శాలు వల్లించలేదు. పెద్ద పెద్ద కబుర్లు చెప్పలేదు. అయినా కూడా నువ్వు ఒప్పుకుంటేనే నాన్నా ఈ పెళ్లి అని ఎంతో వినయంగా ఏడు సముద్రాల అవతల నుంచి కబురు పంపింది.

ఈ ముగ్గురూ మేరు శిఖరాల లాగా కన్పించారు వెంకట్రామయ్యకు. అసలు ఆడవాళ్లంతా అలాంటి మేరు శిఖరాలేమో అనుకున్నాడు.

చిన్నప్పుడు గోరు ముద్దలు తినిపిస్తూ, 'బాబూ, నీ కంటే చిన్నవాళ్లకు, చిన్న చూపు చూడబడేవాళ్లకి నీ సహాయం అందించు. అలాంటి వాళ్లని ఎప్పుడూ కష్టపెట్టకు'' అన్న తల్లి మాటలు అనుకోకుండా మదిలో మెదిలాయి వెంకట్రామయ్యకు.

ఆడవాళ్లను గౌరవంగా చూడడమే గొప్ప అనుకున్నాడు కానీ, వారి ఆలోచనల్ని, భావాల్ని, అంతరంగాల్ని పూర్తిగా గౌరవించలేక పోయానని అనిపించి బాధగా ''అమ్మా నన్ను క్షమించు'' అనుకున్నాడు.

భార్య ఎక్కడుందా అని చూశాడు. ఇవేమీ పట్టినట్టు ఆవిడ తనదారిన తన వంట ప్రయత్నంలో వుంది. నిజంగా ఎంత గొప్పది ఈ ఇల్లాలు అనుకుంటూ చెమ్మగిల్లిన కళ్లతో శాంతమ్మని సమీపించి, ఆవిడ చేతుల్ని కళ్లకద్దుకున్నాడు వెంకట్రామయ్య. ''అలా చూస్తావేమే పిచ్చి మొద్దూ... పద నా తప్పు నాకర్థమయింది.'' అంటూ సుదూర తీరంలో వున్న కూతురికి తన అంగీకారాన్ని తెలియచేయటానికి కంప్యూటర్ వైపు నడిచాడు భార్యతో సహా.

*

చిరునామా: సి.ఎస్.రాంబాబు, 202, కీర్తన హోమ్స్, 11-1-530, మైలారగడ్డ, హైదరాబాద్. ఫోన్: 9441239803